# పెద్దగీత

## 'దీపశిఖ'



అర్ధరాత్రి పన్నెండున్నరైంది టైము.

గదిలోపల తలుపు గడియ పెట్టుకొని ఇంకా పచార్లుచేస్తూనే ఉన్నాడు మూర్తి. నిద్ర రావడంలేదు. తలంతా బరువుగా ఉంది. కళ్ళ వెనుక పీకుతున్నట్టుంది. నెలరోజులుగా తను కన్న కలలన్నీ కల్లలయ్యాయి. అందుకు కాదు ఈ బాధ.

తను ఎలా తలెత్తుకు బ్రతకాలి?

తనవాళ్ళ మొహం ఎలా చూడాలి?

సాయంత్రం ఐదుగంటలనుండీ గుండె గుభేలుమనే సమస్య.

తను ఓడిపోయాడు. చిత్తుగా ఓడిపోయాడు. డిపాజిట్ కోల్పోయాడు. తనగురించి పనిజేస్తున్నట్టు, తనను గెలిపించడానికే కృషిచేస్తున్నట్టూ ఈ నెలరోజులనుండీ తన వెనుక ఉండి, తన డబ్బు మేసి.... ఈ రోజు.... ఎంత నమ్మకద్రోహం? ఇంత అసహ్యంగా మనుషులు ప్రవర్తిస్తారా?

భార్య మెడలోని వస్తువులు, అమ్మదగ్గరకెళ్ళి తెచ్చిన డబ్బు, మొత్తం లక్షా అరవైవేల రూపాయలు.... వీళ్ళ మొహాన పోస్తే....

ఛైర్మన్ అవుతాడని, కలలు కన్నాడు తను.

మిగిలిన కౌన్సిలర్ల గెలుపుకి తను ఎంతో సహాయం చేసాడు. తన ఓటరే, తనని మోసం చేసాడు. అసలు కౌన్సిలర్ కాకుండా.... ఆదిలోనే పీక నులిమి.... చిత్తుగా ఓడించారు.

ఈ అవమానాన్ని ఎలా భరించడం?

భరిస్తూ ఎలా బ్రతకడం?

అవును తను బ్రతకలేడు.

మూర్తికి భార్య గుర్తుకొచ్చింది.

సునీత, తన చెల్లెలి పెళ్ళికి వెళ్ళి మూడురోజులైంది. వెళ్ళడం మానేస్తానంది. ఎలక్షనుకంటే పెళ్ళి ముఖ్యం కాదు వెళ్ళమని తనే పంపాడు. ఇప్పుడు సునీతకి తన మొహం ఏం పెట్టుకొని చూపించగలడు?

నిన్న సాయంత్రం ఐదున్నరకి తూలి పోతూ ఇంటికి చేరాడు మూర్తి. ఎంత మంది ఇంటికొచ్చి తనని కలియడానికి ప్రయత్నించినా 'మాట్లాడాలని లేదు' అంటూ పంపేసాడు.

ఒంటరిగా తను ఆలోచించుకోవాలని ఉంది మూర్తికి.

ఇంత పెద్ద అవమానంనుండి బయట పడ్డం ఎలా?

మూర్తి బుర్రలో ఒకటే ఆలోచన— వచ్చి!

మూర్తి అంతరాల్లోని సమాధానం— ఆత్మహత్య!!

"మూర్తీ! నువ్వు పిచ్చిగా ఆలోచిస్తున్నావ్." హెచ్చరించాడు రాజు.

"లేదు రాజూ! నేను బ్రతకలేను. పిచ్చెక్కిపోతోంది. ఉద్యోగానికి రాజీనామా చేసాను. ఆస్తి మొత్తం తగలేసాను. మోసపోయాను. దారుణమైన ఇంత అవమానాన్ని నేను భరించలేను...." ఏడ్చాడు మూర్తి.

ఉదయమైంది. ఎనిమిదైంది. పదైంది.

గదిలో ఇంకా పచార్లు చేస్తూనే ఉన్నాడు మూర్తి. ఆలోచన్లు తెగక. వాటితో సతమతమవుతూ. గుండెల్ని అవమానాగ్ని దహిస్తుంటే కర్తవ్యం....

భయంగా—

భయంకరంగా—

"పోస్ట్" కేక వినిపించింది.

రేగిపోయిన జుత్తు, ఉబ్బిన ఎర్రటి కళ్ళు, జిడ్డుమొహంతో తలుపు తెరిచి ఉత్తరాలందుకొని లోపల గడియ పెట్టుకొన్నాడు మూర్తి.

రెండుత్తరాలు. ఒకటి ఇన్లెండ్ లెటర్. రెండోది కవరు.

ఫ్రమ్ అడ్రసు గురించి అటూ ఇటూ తిప్పి చూశాడు.

కవరు ఎక్కడ్నించి వచ్చిందో తెలీదు. ఇన్లెండ్ లెటర్ భార్య రాసింది.

ముందు భార్య ఉత్తరం విప్పాడు మూర్తి.

శ్రీవారికి,

ఎన్నికల్లో మీరు నెగ్గుతారని అనిపి

స్తోంది. ఈనాడు పేపర్లో పోటీ చేసిన వారి పేర్లు వేసారు. అందులో మీదీ ఉంది. గెలుపు, ఓటమిలు సహజం. ధైర్యంగా ఏదైనా అంగీకరించండి.

వెంటనే వద్దామనుకున్నాను కానీ, ఇక్కడ పెళ్లి పనులున్నాయి. పెళ్లి బాగానే అయిపోయింది. మిగిలిన కొన్ని పనులకు నన్నుండమని అమ్మా, నాన్నా అడిగారు. అందుకని మరో మూడు నాలుగు రోజులుంటాను. వీలయితే ఉత్తరం రాయండి. ఇలాంటి సమయంలో మీ దగ్గర నేను లేకపోవడం మీకు బాధగానే ఉంటుంది. తోడు లేకపోవడం వలన మీరు ఇంకా బాధపడతారేమో! ఆ ఇబ్బంది తప్పదు మరి.

మీ

సునీత.

పిచ్చి సునీత. నాలుగు రోజులేంటి, శాశ్వతంగానే ఉండాల్సివస్తున్న సంగతి నీకు ఇంకా తెలీదు. అమ్మానాన్నల దగ్గరే నువ్వు గడపాలి. తెల్లచీర కట్టుకొని, బోసిచేతులతో, మెడతో_ మోడులా జీవితం గడిపే ఊహాచిత్రం మూర్తి కళ్ళముందు మెదిలింది.

రెండో కవరు విప్పి, ఉత్తరం మడతలు తీసాడు మూర్తి.

శ్రీ కొలికెలపూడి కృష్ణమూర్తిగార్కి,

నేనెవర్ని ఎక్కడ్నించి రాస్తున్నాను_ అని ఆలోచించకుండా ముందు ఉత్తరం చదవండి. మీ భార్య సునీత, చెల్లెలుపెళ్లి నెపంమీద పుట్టింటికి వెళ్ళింది. అక్కడ సునీతకి ఓ ప్రియుడున్నాడు. అతగాడ్ని కలియడంకోసమే సునీత పుట్టింటికి వెళ్లింది.

సునీత పుట్టింటికి చేరిన తర్వాత గడచిన మూడు రాత్రుల్లో, పెళ్లిరోజు రాత్రి తప్పించి మిగిలిన రెండు రాత్రులు అతనితో సినిమాకి వెళ్ళి గడిపింది.

పిల్లలు లేరని తెగ బాధపడిపోతూ, తనకో బిడ్డను ప్రసాదించమని అతన్ని అడిగింది. అందుకే అతగాడ్ని ఒదలకుండా తిరుగుతోంది. మీ అత్తామామలు పెళ్లి హడావుడిలో పెద్దమ్మాయి సునీత గురించి పట్టించుకోలేకపోతున్నారు.

వాళ్ళిద్దరూ రోజూ కలుస్తున్నా, మోజు తీరక ఇంకా అక్కడే మరికొన్ని రోజులుండడానికి ఆలోచిస్తోంది.

ఇప్పటికయినా మించిపోయిందిలేదు. వెంటనే మీ భార్యను రప్పించుకోండి లేకపోతే వ్యవహారం చాలా దూరం వెళ్తుంది. మీకిలా ఈ ఉత్తరం రాయడం_ ఏ ఫలితమూ ఆశించి కాదు. మీ సంసారజీవితం విచ్ఛిన్నం కాకూడదని శ్రేయోభిలాషిగా మీకు తెలియజేసాను అంతే!

శలవ్

మీ

శ్రేయోభిలాషి.

ఉత్తరం చదవడం ముగించిన మూర్తి నరాలు బిగుసుకుపోయాయి.

శరీరమంతా చెమటపట్టేసింది. ఉత్తరాన్ని తిరిగి చదివాడు. మళ్ళీ చదివాడు. తిరిగి మళ్ళీ చదివాడు. వాక్యం, వాక్యం గుచ్చిగుచ్చి చదివాడు.

ఈ ఉత్తరం నిజమా? అయితే రాసిందెవరు? ఎవడీ శ్రేయోభిలాషి? సునీతకి మరొకడితో శారీరక సంబంధమా? సునీత ఇలాంటి పని చేస్తుందా? మూర్తి మనసంతా వికలమైపోయింది.

తనకు పిల్లలు లేని సంగతి, సునీత తన చెల్లెలిపెళ్లికి వెళ్ళడం ఇవన్నీ నిజాలు. అక్కడ సునీత మరొకడితో తిరుగుతోందా?

అయితే ఈ ఉత్తరం తన అత్తగారి ఊరినుండి వచ్చిఉండాలి.

కవరు తిప్పి పోస్టల్‌స్టాంపు చూసాడు. కళ్ళు చికిలించి మరీ చూసాడు, ఏకాగ్రతతో. అలికేసినట్టూ.... అర్ధంకాకుండా ... అస్పష్టంగా- ఒక్క అక్షరమూ గుర్తుపట్టలేని విధంగా—

మళ్ళీ ఉత్తరం చదివాడు. తన భార్య ఉత్తరంకూడా చదివాడు.

ఏమిటి కర్తవ్యం?

కుర్చీలో వెనక్కి జారగిలబడి, కళ్ళు మూసుకొని కణతలు నొక్కుకున్నాడు. సునీతమీద కసి, కోపం, అసహ్యం ఉవ్వెత్తున లేచాయి.

లేచి, కార్డు అందుకొని ఉత్తరం రాసాడు మూర్తి.

సునీతకు,

అక్కడెన్ని పనులున్నా వెంటనే నువ్వు ఇంటికి రావాలి. నీ గురించి ఎదురుచూసే

నీ భర్త

కె. కె. మూర్తి.

ఉత్తరం రాయడం ముగించి, సబ్బుతో మొహం కడుక్కొని, తనే స్వయంగా వీధిమలుపు పోస్టుడబ్బాలో వేసి ఆకలనిపిస్తే టిఫిన్ చేసాడు మూర్తి హోటల్లో.

పక్కఇంట్లో అద్దెకుంటున్న సుబ్బారావుభార్య అరటిపళ్ళు, కాఫీ పంపింది. ఆ రాత్రి అవి తీసుకొని- భార్య ఆలోచనలతో, పీడకలలతో గడిపాడు.


తెల్లారింది.

కొందరు తనను కలియడానికి, ఎలక్షనుగురించి మాట్లాడడానికి వచ్చారు. వారేవేవో మాట్లాడి వెళ్ళారు. మూర్తి అంతగా వారితో మాట్లాడకపోవడం గమనించి వారే వెళ్ళిపోయారు. ఆ రోజంతా భార్య ఆలోచనలతో ఇంట్లోనే గడిపాడు, హోటల్లో భోజనంచేసే అరగంట తప్ప.

ఆ రెండోరోజు మళ్ళీ రెండుత్తరాలు వచ్చాయి.

ఒక కవరు, ఒక ఇన్లెండ్‌లెటర్.

ముందు కవరు విప్పాడు. విప్పే ముందు పోస్టల్‌స్టాంపు చూసాడు.



అర్థంకాకుండా, అలికేసినట్టూ.... అస్పష్టంగా... ఒక్క అక్షరమూ అంతుపట్టకుండా—

శ్రీ కొలికెలపూడి కృష్ణమూర్తిగారికి,

మీరు రాసిన ఉత్తరం మీ భార్యకు అందింది. ఆమె ప్రియుడి మాట విని దాన్ని అంతగా పట్టించుకోలేదు. నాలుగయిదు రోజులు తనతో గడిపి వెళ్ళమంటున్నాడు. ఆమె అందుకు అంగీకరించింది కూడా.

మీరు వెళ్ళయినా సరే మీ భార్యని వెంటనే అక్కడ్నించి తీసుకొచ్చేయండి. లేకపోతే వ్యవహారం ముదిరేట్టుంది. శలవ్.

మీ
శ్రేయోభిలాషి.

ఇన్లేడ్ లెటరు చించాడు మూర్తి.

శ్రీవారికి,

మీరు రాసిన ఉత్తరం అందింది. అమ్మానాన్నలకు చూపించాను, వెంటనే వెళ్ళిపోతానని. కానీ, నన్ను ఉండమని బలవంత పెడుతున్నారు.

నాలుగు రోజులుండి వస్తాను. మిమ్మల్ని బాధ పెడుతున్నందుకు మన్నించండి.

మీ సునీత.

ఉత్తరాలు రెండూ చింపి, చిన్నచిన్న ముక్కలుగా చేసి కిటికీలోంచి విసిరేసాడు. కోపం తారాస్థాయికి వచ్చింది. కోపంగా, పోస్టాఫీసువేపు అడుగులు వేస్తూ నడవడం మొదలుపెట్టాడు.

*　　*　　*

ప్లాట్‌ఫారంమీదకు రైలొచ్చి ఆగింది.

మూర్తి ప్లాట్‌ఫారం టిక్కెట్ పట్టుకొని దిగేవారిని గమనిస్తున్నాడు. సునీత గురించి అతని కళ్ళు వెతుకుతున్నాయి.

సునీత దిగడం కనిపించింది. దిగి, కంపార్ట్‌మెంటులోకి చూస్తూ, చెయ్యెత్తి నవ్వుతూ ఎవరో్కి విష్ చేసింది.

మూర్తి గబగబ సునీతని చేరుకున్నాడు.

"ఎవరు?" సీరియస్‌గా సునీతని అడిగాడు మూర్తి.

మూర్తిని చూసి ఆశ్చర్యపోయింది సునీత. స్టేషనుకొచ్చినందుకు కాదు, తను కనిపించిన వెంటనే అడిగిన మొదటి ప్రశ్నకు.

"ఎవరు? తెలిసినవారా?" మూర్తి మళ్ళీ అడిగాడు వీలయినంత సౌమ్యంగా.

"కాదు. రైలు పరిచయం" చెప్పింది సునీత.

"ఆడా? మగా?"

భర్త మొహంలోకి వింతగా చూసి, "పదండి బైటకి వెళదాం" అని దోవ తీసింది. రెట్టించి అడగలేకపోయాడు మూర్తి.

వాడు– ఇంతదాకా– రైలులో– ఈమెతో– దిగబెట్టడానికి వచ్చాడా?

రిక్షా ఎక్కుతూ అంది సునీత. "అంత అర్జంటుగా రమ్మని టెలిగ్రాం ఇచ్చారేం?"

మూర్తి జవాబు చెప్పలేదు. అతనిలో మార్పు అంతుపట్టని సునీత మౌనంగా ఉండిపోయింది.

రాత్రి భోజనం ముగించి, సునీత గురించే ఆలోచిస్తూ పడుకున్నాడు మూర్తి.

సునీత తనని మోసం చేసింది ఎందుకు? పిల్లలకోసమా? పిల్లలు లేక పోయినంత మాత్రాన భర్తల్ని మోసం చేస్తారా భార్యలు?

కోపం.... కసి...

"జరగండి" వంటిల్లు సర్ది, లైటార్పి వచ్చి, మూర్తి పక్కలో సర్దుకుంటూ అంది సునీత. ఆలోచిస్తూనే పక్కకి జరిగి పడుకున్నాడు మూర్తి.

భర్తలోని చిలిపితనం మాయమయి, ఇంత సీరియస్‌నెస్ భరించలేకపోతోంది. ఎలక్షన్లో ఓడిపోయినంత మాత్రాన సర్వస్వం పోయినట్టూ, ఇంత బాధ పడిపోవడం సునీతకి నచ్చలేదు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు? ఎలక్షను గురించా?" అడిగింది.

మంచంమీంచి వెళ్ళి సోఫాలో పడుకున్నాడు సమాధానం చెప్పకుండా. సునీత ఎంత మాట్లాడించినా మాట్లాడలేదు.

కళ్ళు మూసుకోనే కన్నీళ్ళు విడిచాడు.

పోస్టులో ఆరోజు ఓ కార్డు, కవరు వచ్చాయి మూర్తిపేర.

కార్డు చిన్నప్పటి మిత్రుడు రాసింది. ఎవరి పెళ్ళికో విజయవాడ వెళ్ళి, తిరిగి వచ్చేటప్పుడు నీ దగ్గర ఓ రోజు గడుపుతానని రాసాడు.

కవరు చింపాడు. ఉత్తరం తీస్తుంటే, మూర్తి చేతులు వణుకుతున్నాయి.

శ్రీ కొలికెలపూడి కృష్ణమూర్తిగారికి,

ఉత్తరం రాయడం ఆలస్యమైంది. క్షమించండి. టెలిగ్రాం ఇచ్చి వెంటనే మీ భార్యను రప్పించుకొన్నందుకు ఆనందంగా ఉంది.

అయితే_ ఓ విచారకరమైన వార్త!

సునీత గర్భవతి !!

అదీ తన ప్రియుడి మూలంగా.

నాకు ఎలా తెలుసని ఆశ్చర్యపోతున్నారా? అందరికంటే ముందు ఆ సంగతి మీ సునీతకే తెలుసు. ఆ సంతోషాన్ని పట్టలేక ప్రియుడికి ఉత్తరం రాసింది.

ప్రియుడి మూలంగా గర్భవతయిన సంగతి, నొక్కి ఎలా చెబుతున్నానని అనుమానమా? దానికి సమాధానం నా దగ్గరలేదు. ఆధారంమాత్రం చెప్పగలను. వెంటనే తెలియకపోయినా, నిజంమాత్రం తెలుస్తుంది ఆలస్యంగా.

మీ భార్య ప్రసవించిన తేదీనుండి, డాక్టరు సహాయంతో గర్భవతయిన తేదీని కనుక్కోండి. అది చెల్లెలి పెళ్ళికి వెళ్ళి ప్రియుడితో గడిపిన ఐదు రోజుల్లో ఒకటయి ఉంటుంది. ఇంతకంటే స్పష్టమైన ఆధారం నా దగ్గర లేదు.

మీభార్య గర్భవతన్న సంగతి తెలియజేయడానికీ, ప్రియుడికీ_మీ భార్యకు ఉత్తరప్రత్యుత్తరాలు సాగుతున్నసంగతీ తెలియజేయడానికే ఈ ఉత్తరం రాయాల్సి వచ్చింది.

మీ భార్య సునీత కనుపులో పేరొకరి జీవం జీవిస్తోంది. మీ రక్తంతో సంబంధంలేని బిడ్డ మీకు వారసుడో లేక వారసురాలు కాబోతున్నది. ఆలోచించండి. అవసరమనుకున్నప్పుడు మళ్ళీ ఉత్తరంలో కలుస్తాను. శలవ్.

మీ

శ్రేయోభిలాషి.

మూర్తి మనసులో చిచ్చుబుడ్డి వెలిగించినట్లు అయింది. నరనరం కంపించింది. శరీరమంతా జ్వాలలు లేచినట్లయింది. కంపరమెత్తిపోయాడు. గిజగిజలాడిపోయాడు.

ఉత్తరం మడచి, కవర్లో పెట్టి, దాన్ని జేబులో పెట్టుకొన్నాడు.

తనకి ఉత్తరాలు రాస్తున్నదెవరు?

ఆ సంగతి ఎలా తెలుస్తుంది?

జేబులోంచి కవరుతీసి పోస్టల్ స్టాంపు పేపు ఏకాగ్రతగా చూసాడు. మామూలే _ అలికేసినట్టూ.... అర్థంకాకుండా... అస్పష్టంగా... ఒక్క అక్షరమూ గుర్తుపట్టలేని విధంగా__

లాభంలేదు. ఈ బాధ భరించలేక పోతున్నాడు.

సునీతను నిలదీస్తే?

చెప్తుందా?

మరి నిజం ఎలా తెలుస్తుంది?

పోస్టాఫీసుకి వెళ్ళాడు, ఖాన్ గురించి. వాడు తనకి ఉత్తరాలిచ్చే పోస్టుమాన్. లేడు. ఇంటికి వెళ్ళాడు. పేకాడుతున్నాడు మరి కొందరితో కలిసి.

బైటికి పిలిచి చెప్పాడు.

"నా భార్యకు వేరే ఉత్తరాలు వస్తున్నాయా? నాకు ఇవ్వకుండా ఆమెకి నాకు తెలీకుండా ఇస్తున్నావా?

ఖాన్ ముఖంలో భయం కనబడుతోంది. తడబాటుకూడా.

మూర్తి అర్థంచేసుకున్నాడు.

"ఈసారి ఆమెకి వచ్చిన ఉత్తరాలు కూడా నాకే ఇవ్వు. ఉంచుకో ఇవి." ఐదు ఐదు రూపాయలనోట్లు పట్టుకొని ఖాన్‌వేపు ఆ చెయ్యి సాచాడు.

ఖాన్ వాటిని అందుకున్నాడు.

* * *

విమలాభాయి, సునీతని పదిహేను నిమిషాలు పరికించి, పైకివచ్చింది. అంతదాకా పరీక్షా ఫలితాలకోసం ఎదురుచూసే విద్యార్థిలా కూర్చున్న మూర్తి వేపు చూసింది.

"సారీ" అంది.

రక్తం చివ్వున మూర్తి మొహంలో ప్రాకినట్లయింది.

"ఏమైంది?" ఆత్రతగా అడిగాడు మూర్తి.

"మీ భార్య ప్రెగ్నెంట్ కాదు. అవునని ఎందుకనుకొన్నారు?".

"ఆమే చూపిద్దామని వచ్చింది" అబద్ధం చెప్పాడు సునీతకేసి నవ్వుతూ చూస్తూ. మూర్తికేసి వింతగా చూసింది సునీత.

డాక్టర్ విమలాభాయి దగ్గరనుండి ఇంటికిరిక్షాలో వస్తూ, సినిమాకి వెళదాం అన్నాడు భార్యతో. సునీత రానంది. కడుపులో నొప్పిగా ఉందని రిక్షా ఎక్కేటప్పుడే నొప్పి మొదలైందని చెప్పింది.

శ్రేయోభిలాషి అబద్ధం రాసాడు. ఎందుకు? తనకూ, తన భార్యకూ మధ్య అపోహలు సృష్టించడానికా? ఈ నాటకం ఆడుతున్నదెవరు?

మూర్తి మనసు కాస్త హాయిగా ఉంది. తన భార్య ప్రెగ్నెంట్ కాదు. రాత్రి భోజనం ముగించి పడుకునే ముందు స్నానంచేసొచ్చి, వేరే చీర కట్టుకొంటూ చెప్పింది సునీత—


"మూడు రోజులు మీరే వొంట చేయాలి."

"ఏం?"

"నేను ఇంటోకి రాకూడదు."

మూర్తి మనసు దూదిపింజలా తేలిపోయింది. ఆమె మీద ఏర్పడ్డ అపోహ పటాపంచలైంది.

హాయిగా నిద్రపట్టింది మూర్తికి.




మూర్తికి పోస్టుమేన్ రెండు కవర్లిచ్చి వెళ్ళాడు.

ఒకటి సునీతకి, రెండోది ఉషకి.

ఉషకి వచ్చిన ఉత్తరం చదవకుండా చింపేయాలనుకున్నాడు మూర్తి. మానవ సహజమైన కుతూహలం నోరు నొక్క లేకపోయాడు. ఆ కవరుమీద పోస్టల్ స్టాంపు అర్థంకాకుండా అస్పష్టంగా. అలికేసినట్టూ ఒక్క అక్షరమూ అర్థంకాకుండా—

ముందు సునీత కొచ్చిన కవరు చింపాడు.

మై డియర్ సునీతా!

కంగ్రాచ్యులేషన్స్. మొత్తానికి సాధించావ్. నాకు ఎంత థ్రిల్లింగ్గా ఉందో తెలుసా? నిన్ను చూడాలనీ— నీతో మాట్లాడాలనీ— నీ బుగ్గల్లో సిగ్గుల కెంపులు చూడాలనీ ఎంతో— ఎంతో ఆత్రుతగా ఉంది. ఎలా?

మీ అయన పోటీచేసి ఓడిపోయాడని రాసావ్? పూర్ ఫెలో నా సంతాపం అందజేయి.

అన్నట్టు మన్మథలీలలు సిన్మా చూస్తూ నీకో ఉంగరం ఇచ్చాను. దాన్ని నాకు అందజేయమని రాసాను. దానికి సమాధానం రాయలేదేం? సరే—

నువ్వు రాసిన ఉత్తరం చదువుతుంటే— అందులో ముఖ్యంగా 'నాలో మీరు' అంటూ పుట్టబోయే బిడ్డ గురించి రాసిన వాక్యం వందసార్లయినా చదివాను.

నేను రాసే ఉత్తరాలు మీ అయన కంటబడవని రాసావ్. ఆ ఏర్పాటు మీ పోస్టుమేన్తో చేసానని రాసావ్. నీ తెలివితేటలు చూస్తుంటే అసూయగా ఉంది. వివరంగా వెంటనే ఉత్తరం రాయి. వీలయినంత త్వరలో నిన్ను 'కలియాలని'

ఉంది. ఎప్పుడు? ఎక్కడ? ఎలా? రాయి.

నీ

రవీంద్ర.

రవీంద్ర! ఎవడీ రవీంద్ర!?

తన నమ్మకాలన్నీ పటాపంచలయ్యాయి.

డాక్టరు అబద్ధం చెప్పిందా?

మరి, మరి సునీత గత రాత్రి....

పడకగదిలోంచి బైటకెళ్ళి చూసాడు. చాపమీద క్రింద పడుకొని నిద్రపోతోంది.

రెండో కవరు చించుతూ మంచం మీద వాలిపోయాడు మూర్తి. తనని నిస్సత్తువ ఆవరిస్తోంది. తన శరీరంలో ఆవిర్లు ఎగిసివస్తున్నాయి.

శ్రీ కొలికెలపూడి కృష్ణమూర్తిగారికి,

నమస్కారం. మీ అజ్ఞానానికి నవ్వు వస్తోంది. సునీత గర్భవతి అవునో కాదో తెలుసుకోడానికి మొన్న డాక్టరు విమలాభాయి దగ్గరకు వెళ్ళారు. గర్భవతి కాదని చెప్తే సంతోషపడి తిరిగొచ్చేశారు. అదేరోజు రాత్రి బయటు అయినట్లు సునీత చెప్తే నమ్మేసి సంబరపడిపోయారు.

డాక్టరు విమలాభాయి మీతో అబద్ధం చెప్పింది. చూస్తూ ఓ కాపురాన్ని ఏ డాక్టరూ కూలదోయదు. సునీతని చెక్ చేయడానికి లోపలికి తీసికెళ్ళినపుడు డాక్టరుకి అంతా చెప్పి, రక్షించమని కాళ్ళు పట్టుకుంది. సునీత కాపురం కాపాడ్డానికి ఆమె అబద్ధం చెప్పింది.

కావాలంటే మరో డాక్టరు దగ్గర పరీక్ష చేయిస్తే అసలు నిజం బయట పడుతుంది. మీ భార్య గర్భవతన్న సంగతి ఋజువవుతుంది. అప్పుడు నిజం చెప్పానని ఒప్పుకోక తప్పదు.

మెన్సస్ కాకుండానే అయినట్లు నాటకం ఆడింది సునీత. మగాడి కేం తెలుస్తుందిలెమ్మని— ఆ రెండు రోజులూ బొట్టు పెట్టుకోవడం మానేస్తే సరని భావించింది తాత్కాలికంగా. ఎంత కాలం గర్భాన్ని దాయగలరు? ఆ తర్వాత మీ మూలంగా గర్భవతయినానని బయట పెడుతుందేమో?

చేయి కాలకుండానే ఆకులు పట్టుకొంటారని ఈ సంగతులు ముందే మీకు తెలియజేస్తున్నాను. మీ భార్య కడుపులో పెరుగుతున్న పరాయిబిడ్డ, మీకు వారసులు కాకుండా చేసుకొంటారని ఆశిస్తూ—

మీ

శ్రేయోభిలాషి.

మూర్తి తల గిర్రున తిరిగిపోతోంది.

డాక్టరు విమలాభాయిఅబద్ధంచెప్పింది.

సునీత మెన్సస్ కాకుండానే అయినట్టు నటించింది.

సునీత ఇంత దారుణంగా మోసం చేస్తోందా?

ఇవన్నీ శ్రేయోభిలాషి కెలా

తెలుసు? తన కెందుకు రాస్తున్నట్టు. నిజంగా తన శ్రేయస్సు కోరేవాడు తనకి రాసి ఎందుకు చిత్రహింసకు గురిచేస్తున్నాడు?

మూర్తి రకరకాలుగా ఆలోచిస్తున్నాడు. తల తిరుగుతోంది. గంగవెర్రు లెత్తుతోంది. నీరసం ఆవహిస్తోంది. పిచ్చి పట్టినట్లయిపోతున్నాడు.

"సునీతా! నిజం చెప్పు సునీతా! నువ్వు తప్పుచేసినా క్షమిచంగలనేమో కానీ, ఈ మానసిక వేదన భరించలేక పోతున్నాను. అబద్ధమా? నిజమా? ఈ రహస్యం బట్టబయలు చెయ్యి. నిద్ర కరువయ్యింది. ఆకలి లేదు మరో ఆలోచన లేదు. చెప్పు సునీ సునీ ఈ బాధ భరించలేకపోతున్నాను. సునీ. సునీ."

పిచ్చి. పిచ్చిగా. మంచంమీద తల పట్టుకొని అరుస్తున్నాడు మూర్తి. తలను మంచానికేసి బాదుకుంటున్నాడు మూర్తి.

మూర్తి అరుపులకి లేచి, పరిగెత్తుకు వచ్చింది ఇంట్లోకి సునీత.

భయంగా, బాధగా మూర్తికేసి చూసింది సునీత.

* * *

మై డియర్ కృష్ణమూర్తీ!

నన్ను మనస్ఫూర్తిగా క్షమించాలి. గత కొన్నిరోజులుగా నిన్ను మానసికంగా చికాకుపరచడానికి ఉత్తరాలద్వారా ప్రయత్నించాను.

నిన్ను కలసి ఈ సంగతులన్నీ చెప్పాలనుకున్నాను. నిన్ను చూస్తూ ఎలా మొదలుపెట్టాలో అర్థంకాక, ఓ విధంగా భయమేసి కూడా ఈ చిన్న ఉత్తరం రాస్తున్నాను. ఈ ఉత్తరం చదివాక నన్ను కలువు. అన్నీ మాట్లాడుకుందాం. నీ కోసం చూస్తుంటాను.

ఎన్నికల్లో ఓడిపోయేవ్-మానసికంగా దిగజారి ఆత్మహత్యకు ఆలోచించావ్ అప్పుడు మిత్రుడిగా. నీ శ్రేయస్సు కోసం ఆలోచించి. నిన్ను బాధించే. అవమానించే ఎన్నికల పరాభవంనుండి మరో సమస్యవేపు నీ మనసు మళ్ళించడానికే.. ఈ ఉత్తరాయణం-

ఎంత పెద్ద గీతనయినా చెరపకుండా చిన్నదాన్ని చెయ్యాలంటే పక్కనే దానికంటే పెద్ద గీత గీయాలి. నేను చేసింది అదే.

పెద్దగీత గీయడానికి సహకరించిన మిత్రులు పోస్టుమేన్, డాక్టరు విమలా బాయి, మా పక్కింటి సుబ్బారావు, అతని భార్య, నీకు నేను రాసే ఉత్తరాలను దస్తూరి మార్చి రాసే మా అబ్బాయి వేణు.

వెంటనే ఇంటికి రా. చూస్తుంటాను.

నీ

రాజు.